క్లుప్తంగా

దాహార్తులకు మజ్జిగ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మండే ఎండల్లో దాహార్తులకు చల్లటి మజ్జిగను సామాజిక బాధ్యతగా పంపిణీ చేస్తున్నామని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు బి.వసంతకుమార్ పేర్కొన్నారు. దుర్గాపురం అల్లూరిసీతారామరాజు వంతెన సమీపంలో బుధవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన 300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. సొసైటీ సభ్యులు గుర్రం ఏడు కొండలు, మండా రాము, వీరంకి గోకర్లేశ్వరరావు, కొండా ఏసు బాబు, కోలా నాగరాజు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వార్డు వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని డివిజన్లలో వార్డు వలంటీర్లుగా సేవలు అందించడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ అర్హత ధ్రువీకరణ పత్రాలతో హెచ్‌టీటీపీ://40.81.241.107/ఏపీవలంటీర్20/ఏపీవలంటీర్090420201049వీటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వీఎంసీ స్పెషల్ సెల్ 81859 33187 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

అంబేడ్కర్ స్మృతివనం పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): స్వరాజ్యమైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఏర్పాట్లు శరవేగంగా జరగాలని మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన స్మృతివనం పనులను బుధవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, క్వాలిటీ కంట్రోల్ అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టంచేశారు. కారిడార్, గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నిర్ణీత గడువు లోపు అన్ని పనులను పూర్తి చేయాలని కోరారు. అవసరమైతే అదనంగా కార్మికులను ఏర్పాటు చేసుకుని రాత్రివేళల్లో కూడా పనులు వేగవతం చేయాలని ఆదేశించారు.

సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చంద్రశేఖరరెడ్డి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా విజయవాడకు చెందిన తనుబుద్ది చంద్రశేఖరరెడ్డి నియమితులయ్యారు. ఆయనను కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన చంద్రశేఖరరెడ్డి వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నాటి నుంచి చురుకుగా పనిచేస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి, వర్ధంతులను పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. డైరెక్టర్‌గా నియమితులైన చంద్రశేఖరరెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

పేదలకు అన్నసంతర్పణ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): క్లే లలిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద బుధవారం పేదలకు అన్నసంతర్పణ జరిగింది. కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు నందెపు జగదీష్ పాల్గొని పేదలకు భోజనాలు వడ్డించారు. పేదల ఆకలి తీర్చడం ఎంతో పుణ్యమని, క్లే లలిత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి నెలా 12వ తేదీన పేదలకు దుస్తులు, నిత్యావసర సరుకుల పంపిణీ, అన్నసంతర్పణ, చిరువ్యాపారులకు తోపుడు బండ్లు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బస్సు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడ నుంచి మైలవరం వెళ్తున్న సిటీ బస్సు సొరంగం రోడ్డులో డివైడర్‌ను ఢీకొట్టడంతో పలువురు ప్రయాణికులకు గాయపడ్డారు. ఈ ప్రమాదం బుధవారం రాత్రి జరిగింది. విద్యాధరపురం డిపోనకు చెందిన 218 నంబరు సిటీ బస్సు రాత్రి 10.30 గంటల సమయంలో బస్టాండ్ నుంచి మైలవరం బయలుదేరింది. కేటీ రోడ్డు మరమ్మతుల నేపథ్యంలో సితార మీదగా చిట్టినగర్ వైపు ప్రయణిస్తూ సొరంగం నుంచి బయటకు వచ్చిన తర్వాత రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు ఎదుటి భాగం దెబ్బతినగా, పలువురు ప్రయాణికులు స్వల్పంగా గయపడ్డారు. ప్రయాణికులు మరో బస్సులో తమ స్వస్థలానికి చేరుకున్నారు.

మహానేత స్ఫూర్తితో సంక్షేమ కార్యక్రమాలు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మహానేత వైఎస్సార్ స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మహోద్యమంలా అమలు చేస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 63వ డివిజన్ 276వ వార్డ్ సచివాలయం పరిధిలో ఆయన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఎమ్మెల్యే విష్ణు రాధానగర్, డాక్టర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక ప్రజలను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. 210 గడపలను సందర్శించి ప్రజలు చెప్పిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం అందించని గొప్ప సంక్షేమ పాలనను సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారని తెలిపారు. గ్రామ/వార్డ్ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిట్లోకే ప్రభుత్వ వ్యవస్థలను తీసుకురావడంతో పాటు 'గడప గడపకు మన ప్రభుత్వం' అనే కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటికే ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని వివరించారు. తన పర్యటనలో భాగంగా 276వ వార్డ్ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. రోజూ మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకూ ప్రజల నుంచి గ్రీవెన్స్ స్వీకరిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. ప్రజల నుంచి తీసుకున్న అర్జీలను తప్పనిసరిగా రికార్డుల్లో పొందుపర్చాలని సూచించారు.

చంద్రబాబు ఆత్మపరిశీలన చేసుకోవాలి

చంద్రబాబు గత పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని ఎమ్మెల్యే విష్ణు విమర్శించారు. జిల్లాలో పర్యటించే ముందు టీడీపీ హయంలో జిల్లా ప్రజలకు చేసిన మంచి ఏమైనా ఉందా అని ఆత్మవిమర్శ చేసుకొని దానిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు వైఎస్సార్‌ను నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్ పథకాలను కాపీ కొట్టడం తప్ప చంద్రబాబు చేసేదేమీ లేదని ఎద్దేవా చేశారు. కార్పొరేషన్ ఈఈ శ్రీనివాస్, డీఈ రామకృష్ణ, ఏఈ అరుణ్ కుమార్, సీడీఓ జగదీశ్వరీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, నాగు తదితరులు పాల్గొన్నారు.

నగర పయనం.. అభివృద్ధి పథం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి. మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ కౌన్సిల్ హాల్లో ఆమె బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగర జనాభాకు అనుగుణంగా, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నిత్యం 187 ఎంఎల్‌డీ (మినిమల్ లిక్విడ్ డిశ్చార్జ్) సరఫరా చేస్తున్నామని తెలిపారు. కొండప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అవాంతరాలు లేకుండా బూస్టర్ల సహాయంతో పంపిణీ చేస్తున్నామని వివరించారు. శివారు ప్రాంతాల్లో తాగునీటి రవాణా చేస్తున్నామన్నారు. కొత్తగా చేతి పంపులు, పవర్ బోర్‌వెల్స్, పంపుసెట్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది తాగునీటి సరఫరాలో 30 పనులకు రూ.18.14 కోట్లు నిధులు వెచ్చిస్తున్నామని, సర్కిల్–1 పరిధిలో 8 పనులకు రూ.49.90 లక్షలు, సర్కిల్–2 పరిధిలో 14 పనులకు రూ.64.39 లక్షలు, సర్కిల్–3 పరిధిలో 8 పనులకు రూ.67.20 లక్షలు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఐదు ట్యాంకర్ల ద్వారా శివారు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. వేసవి నేపథ్యంలో నగరానికి వచ్చే వారికి, పాదచారులు, ప్రయాణికులకు నగరంలోని మూడు నియోజక వర్గాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సర్కిల్–1 పరిధిలో 13 జనసద్రత కలిగిన ప్రాంతాల్లో, సర్కిల్–2 పరిధిలో ఆరు ప్రాంతాల్లో, సర్కిల్–3 పరిధిలోని 15 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్టును తొలగించేందుకు రూ.24.5 కోట్లు వెచ్చిస్తున్నామని, 39 పనులకు ఈ నిధులు ఖర్చు చేయనున్నామని తెలిపారు. డీసిల్టింగ్‌కు సర్కిల్–1 పరిధిలోని 12 పనులకు రూ.65.38 లక్షలు, సర్కిల్–2 పరిధిలో పది పనులకు రూ.1.1కోట్లు, సర్కిల్–3 పరిధిలో 17 పనులకు రూ.78.29 లక్షలు కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి ఖర్చు చేస్తున్నామన్నారు. పన్నుల వసూళ్లు కూడా 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆశాజనంగా ఉన్నాయని తెలిపారు. ఆస్తి పన్నుల్లో రూ.177 కోట్లు డిమాండ్ ఉండగా రూ.140.16 కోట్లు వసూళ్లు చేశామని, ఖాళీస్థలాల పన్నుల్లో రూ.202 కోట్లు డిమాండ్ ఉండగా రూ.35.16 కోట్లు, తాగునీటి పన్నులకు రూ.64.26 కోట్ల డిమాండ్‌కు రూ.36.21 కోట్లు, డ్రెయినేజీ పన్నుల్లో రూ.42.35 కోట్లు డిమాండ్ ఉండగా రూ.2.34 కోట్లు వసూళ్లు చేశామని పేర్కొన్నారు. మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో 2023లో గార్బేజ్ ఫ్రీ సిటీ విభాగంలో 7 స్టార్ సాధించామని తెలిపారు. ఈ సమావేశంలో డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజా రెడ్డి పాల్గొన్నారు.

41వ డివిజన్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం 41వ డివిజన్ మసీద్ వీధిలో కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు జరిగింది. ఈ విందులో ముస్లింలతో కలిసి విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలో పయనిస్తూ ముస్లిం మైనార్టీలకు తన పాలనలో పెద్ద పీట వేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై అల్లా ఆశీస్సులు ఉండాలని కోరారు. జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, నాయకులు ఆకుల శ్రీనివాసరావు, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఖాజా వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సీఐ లక్ష్మీనారాయణ సేవలు భేష్



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణకు సీఐగా ఎస్.వి.వి.ఎస్.లక్ష్మీనారాయణ అందించిన సేవలు అభినందనీయమని ప్రతి స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు కోలా శాంతకుమారి అన్నారు. సింగ్‌నగర్ సీఐగా నాలుగేళ్ల సేవలందించి, బదిలీపై టాస్క్‌ఫోర్స్‌కు వెళ్తున్న సీఐ లక్ష్మీనారాయణను ఆ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్లర్లను తగ్గించడంలో, ప్రజలకు రక్షణ చర్యలు కల్పించడంలో లక్ష్మీనారాయణ చేసిన సేవలు ఆదర్శనీయమైనవని కొనియాడారు. 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, బీసీ నాయకురాలు కొండా జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇసరపు రాజు, భూమా రమేష్ తదితరులు సీఐను సన్మానించి, అభినందనలు తెలిపారు.

రోటరీ క్లబ్ ఆఫ్ బెజవాడ స్టార్స్ ఆవిర్భావం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట కాంగ్రెస్ ఆఫీసు రోడ్డులోని సెంటర్ సైడ్ హోటల్‌లో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ బెజవాడ స్టార్స్ ఆవిర్బవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ బెజవాడ స్టార్స్ ప్రెసిడెంట్‌గా చిన్నం రామకృష్ణ, కార్యదర్శిగా గంధం శ్రీనివాసరావు, కోశాధికారిగా కోనపులి సూరిబాబు, పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.వి. రామారావు, ఎం.సి.దాసు, ప్రస్తుతం గవర్నర్ ఆర్. సుబ్బారావు హాజరయ్యారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కేఎల్‌రావు పార్కు రోడ్డుకు చెందిన దేవరపల్లి బ్లెస్సీ(38)కి గుడివాడ మండలం పెదఎరుకపాడు గ్రామానికి చెందిన బొల్లవరపు రాజేష్‌కుమార్‌తో వివాహమైంది. వివాహ సమయంలో రూ.25 లక్షల కట్నం, ఆడపడుచు కట్నం, ఇతర లాంఛనాలు భారీగానే ఇచ్చారు. కొంత కాలంగా భర్త రాజేష్‌కుమార్‌తో పాటు అతని తల్లి సుశీల, తండ్రి ఆదాం, ఆడపడుచులు జ్యోతి, సరోజినిదేవి, జీవన్‌కుమార్ వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎక్సెల్ ప్లాంట్ అభివృద్ధి పనుల పరిశీలన



ఎక్సెల్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలోని ట్రీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ స్క్రాప్, స్క్రాప్ ష్రేసింగ్ యూనిట్, ఆఫీసు బిల్డింగ్, మాట్రేస్స్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, వెహికల్ పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. నూతన ఆఫీసు బిల్డింగ్ నిర్మాణ పనులను చెత్త వేయింగ్ (వే బ్రిడ్జి) పని తీరును పర్యవేక్షించారు. ప్లాంట్ ఆవరణలోని గ్రీనరీని మరింత పెంచాలని అధికారులకు సూచించారు. ప్లాంట్ ఆవరణలో డ్రెయిన్లను పరిశీలించి అందులో చెత్తాచెదారం ఉండటం, మురుగు నీరు ప్రవహించకపోవడాన్ని కమిషనర్ గుర్తించారు. డ్రెయిన్లలో వెంటనే సిల్టు తొలగించాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సత్యనారాయణరావు, ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

భావోద్వేగాలపై నియంత్రణ అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జయచంద్రరాజు

పటమట(విజయవాడతూర్పు): దేశంలో కొంతకాలంగా జరుగుతున్న సంఘటనలకు కారణం భావోద్వేగాలపై నియంత్రణ, మేధస్సు లోపమే కారణమని ప్రముఖ వ్యాపారవేత్త ఎల్.జయచంద్రరాజు అన్నారు. భావోద్వేగాలపై నియంత్రణ అవసరమని సూచించారు. కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల్లో భావోద్వేగ మేధస్సు అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి జయచంద్రరాజు మాట్లాడుతూ.. భావోద్వేగ పరిస్థితుల్లో మనుషులను ఆలోచనా విధానంలో జరిగే మార్పులు, వాటికి కారణాలు, నియంత్రణ విధానాలను విద్యార్థులకు వివరిచారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచంట సునీత మాట్లాడుతూ.. నేటి చదువులు, ఉద్యోగాల్లో ఒత్తిడి వల్ల స్వల్ప విషయాలకే అభిప్రాయభేదాలు ఏర్పడుతున్నాయని, దీంతో మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థులు భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహణ అధికారులు డాక్టర్ సీహెచ్ నాగభూషణం, డాక్టర్ సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ లేని సమాజం కావాలి

ఏపీ జువైనల్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రసాదమూర్తి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాదమూర్తి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు లేని సమాజాన్ని తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ స్టేట్ డైరెక్టర్ బి.డి.వి. ప్రసాదమూర్తి పిలుపునిచ్చారు. ప్రపంచ వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చైల్డ్‌లైన్–1098, ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్, జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, మహిళా శిశు సంక్షేమ శాఖ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహంలో బుధవారం అవగాహన చైతన్య సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాదమూర్తి మాట్లాడుతూ.. నేటి సమాజంలో కొందరు బాలబాలికలు మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్న బాలలను గమనిస్తే వెంటనే చైల్డ్‌లైన్–1098కు లేదా 100 డైల్‌కు లేదా ఉమెన్ హెల్ప్ లైన్ –181కు సమాచారం ఇచ్చి వారిని రక్షించాలని కోరారు. చైల్డ్‌లైన్–1098 నోడల్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆలనాపాలనా లేక కొందరు అనాథలుగా మరి కొంత మంది వీధి బాలలుగా, బాల కార్మికులుగా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సీపీఎస్ మధుసూదనరావు మాట్లాడుతూ.. బాలలందరూ విద్యపై శ్రద్ధ చూపాలని, అపరిచిత వ్యక్తుల పరిచయాలతో మోసపోకూడదని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణపై పోస్టర్‌ను ఆవిష్కరించి, బాలలతో ప్రతిజ్ఞ చేయించారు. జువైనల్ హోమ్ పర్యవేక్షణాధికారి పి.రామమోహన్‌రెడ్డి, డీసీపీయూ కౌన్సిలర్ జీవన్‌కుమార్, చైల్డ్‌లైన్ సెంటర్ కో ఆర్డినేటర్ పి.నాగరాజు, సభ్యులు అబ్రహాం, స్వరూపరాణి, ఎస్.ప్రవీణ్, బర్డ్స్ సంస్థ సెక్రటరీ కె.ప్రకాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వ మానవాళి సంతోషమే రంజాన్ సందేశం



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఇక్బాల్‌అహ్మద్, ఇంతియాజ్ అహ్మద్, ఆసిఫ్ తదితరులు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సర్వ మానవాళి సుఖసంతోషాలతో జీవించాలన్నదే రంజాన్ సందేశమని ఏపీ మైనార్టీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని షాజహూర్ ముసాఫిర్‌ఖానా ప్రాంగణంలో బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భారీగా ముస్లింలు తరలి వచ్చారు. తొలుత ఉపవాస విరమణ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. అనంతరం ఇక్బాల్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ సమాజంలో ఆకలిదప్పికలు ఉండకూడదని రంజాన్ మాసం ద్వారా అల్లా బోధిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వం ముస్లిం మైనార్టీలకు అండగా నిలిచిందని ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. రంజాన్ నెలలో చేసే ప్రతి భగవత్ ప్రార్థన అద్భుత ఫలితాన్ని అందిస్తుందన్నారు. ఏపీ సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ అహ్మద్, ఏపీ వక్ఫ్‌బోర్డు సీఈఓ షిరీన్‌బేగం, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తదితరులు ఆసిఫ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు ఇమామ్‌ఖాన్, వాజీద్‌ఖాన్, షేక్ జిలానీ, మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు రియాజ్, డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు మెహబూబ్, బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు కనిశెట్టి లక్ష్మణరావు, మండల శ్రీను, దాడి జగన్, పైడిపాటి మురళీ తదితరులు పాల్గొన్నారు.

మాకినేని బసవపున్నయ్యకు ఘన నివాళి



బసవపున్నయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మధు తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గొప్ప సిద్ధాంతవేత్త, అణగారిన పేదల పక్షాన తన జీవితాంతం పనిచేసిన వ్యక్తి మాకినేని బసవపున్నయ్య అని ఎంబీ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ పి.మధు అన్నారు. గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో బుధవారం బసవపున్నయ్య 31వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. బసవపున్నయ్య తన ఆస్తులన్నింటినీ జాతీయోద్యమ కాలంలోనే ప్రజలకోసం ఖర్చు చేశారని పేర్కొన్నారు. 1936లోనే విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించరన్నారు. బసవపున్నయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం కోసం విజ్ఞాన కేంద్రం వెనుకబడిన తరగతుల వారికి కంప్యూటర్, కుట్టు, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తోందన్నారు. తులసీరావు, మురళీకృష్ణ, మాల్యాద్రి, రామన్న, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం అందజేత



వృద్ధాశ్రమానికి బియ్యం పంపిణీచేస్తున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ బాధ్యులు

పెనమలూరు: పంజాబ్ నేషనల్ బ్యాంక్ 129 వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కానూరు వృద్ధాశ్రమానికి బుధవారం బియ్యం పంపిణీ చేశారు. డెప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వ్యవస్థాపన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపి పీఎన్‌బీ శాఖల్లో ఖాతాదారులకు సమావేశం జరిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు.

త్రిశక్తి పీఠానికి రూ.8.83 లక్షల ఆదాయం



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. 2022 నవంబర్ 19 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు 142 రోజులకు రూ.8,83,181 ఆదాయం లభించింది. దేవదాయ శాఖ తరపున శనైశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు 12 హుండీల్లోని కానుకలను లెక్కించారు. ఆలయ పాలకవర్గ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కార్యదర్శి కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బి.హెచ్.విజయకిరణ్, కమిటీ సభ్యులు ఎం.వి.రాజా, జి.సత్యనారాయణ, విశ్వేశ్వరయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ కానుక పంపిణీ



రంజాన్ కానుక పంపిణీచేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, పూనూరు గౌతంరెడ్డి తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ మొహర్రాజ్ ఆధ్వర్యంలో బుధవారం పేద ముస్లింలకు రంజాన్ కానుక పంపిణీ చేశారు. చిట్టినగర్ ఈద్గామహల్ షాదీఖానాలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి హాజరయ్యారు. 80 మందికి బియ్యం, సేమియా, నెయ్యి, ఇతర సరుకులతో కూడిన కిట్‌లను అతిథులు అందజేశారు. పేదలు కూడా పండుగను సంతోషంగా జరుపుకోవాలనే భావనతో రంజాన్ కానుక పంపిణీచేయడం అభినందనీయమని అతిథులు పేర్కొన్నారు. 80 మంది పేదలకు ఈద్గామహల్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. 48వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, ఈద్గామహల్ షాదీఖానా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా, సెక్రటరీ ఇషాక్ ఆలీ రషీద్, షేక్ బాషా, చిచ్చా తదితరులు పాల్గొన్నారు.